## గోరంత గోరంతే!

చిట్టిగాడు స్కూలునుంచి వస్తూనే పుట్టెడు బరువు మోస్తున్నట్లు తెగ ఆయాసపడుతూ పుస్తకాల సంచీ, టిఫిన్‌బాక్సూ గుమ్మంలోనే పడేశాడు.

"అమ్మా! పాలు. తొందరగా ఇచ్చెయ్యవే!" వంగి ఇల్లూడ్చుకుంటున్న తల్లి కొంగు పట్టుకు మారాం చెయ్యడం మొదలెట్టాడు.

"అబ్బ! ఉండరా! ఏంటా దూకుడు? బూట్లు విప్పుముందు. డ్రెస్ మార్చుకో!"

"ఉహు! ఆకలేస్తోంది ముందు పాలే తాగుతాను." బుంగమూతి పెట్టాడు మారాం చేస్తూ.

చిట్టి మంకుపట్టు లతకి బాగా తెలుసు. అందుకే మరోసారి కేకలెయ్యకుండా పాలగ్లాసు తెచ్చి ఇచ్చింది. అది పుచ్చుకుని ఒక్క అంగలో 'తాతయ్యా!' అంటూ బైటకి పరిగెత్తాడు.

"ఒరే,చిట్టీ! ఆగరా! రోజూ ఇలా ఆయన్ని విసిగిస్తే ఎలారా!" అంటూన్న లత మాటలు లత దగ్గరే ఉండిపోయాయి. వాడి చిలిపితనానికి నవ్వుకుంది లత.

ఆ తాతయ్యకి ఈ చిట్టిగాడు వంశాన్ని ఉద్ధరించేవాడేం కాదు. అష్టకష్టాలూ పడి ఓ అయ్యచేతిలో పెడితే కన్నకూతురు 'నాన్నా! నిన్ను తాతయ్యని చేశాను.' అంటూ మురిపెంగా అందించిన ముద్దుల మనవడూ కాదు. తాతయ్య అనబడే ఆవ్యక్తి అసలు బంధువే కాడు.

అంతకు మించిన బంధమేదో పెనవేసుకుంది వాళ్ళిద్దరి మధ్య. చిట్టిగాడి కోసం వీధిలోనే ఎదురు చూస్తున్న రషీద్ వాణ్ణి చూడగానే ముసిముసినవ్వుల్తో లోపలకెళ్ళి చెంచాతో పంచదార పట్టుకొచ్చాడు. పాలల్లో పంచదార కరిగి తీపినిచ్చింది. తాత ఒళ్ళో చేరి పాలు తాగుతూ చిట్టిగాడు చెప్పే కబుర్లు రషీద్‌కి మరింత తియ్యదనాన్ని.

"తాతయ్యా! పాలలో కెళ్ళి పంచదార ఏమౌతుంది?"

"కరిగిపోయి పాలంతకీ తీపినిస్తుంది." రషీద్ చిట్టిగాడి ప్రశ్నకి జవాబు చెబుతుంటే రజియా మాటలు గుర్తుకొచ్చాయి.

"డాడీ! మీ రెండు కుటుంబాల ఆత్మీయత చూస్తూంటే పాలల్లో చక్కెర కలిసినట్టుగా ఉంది!"

'బేటీ అన్నది నిజమే! కాకుంటే తనకి లత, రఘుపతి ఎవరు? వాళ్ళకి తానెవరు? అంతా అల్లా దయ! ఈశ్వరలీల!' అనుకున్నాడు రషీద్.

పాలగ్లాసు ఖాళీ చేసి నేలమీద గిరవాటేస్తూ, రషీద్ చెయ్యిపట్టి లాగాడు చిట్టి. "ఆడుకుందాం రా తాతా! మళ్ళీ అల్లా పాటంటావు నువ్వు! కుంచెంసేపు నాతో ఆడవూ!" అని మారాంచేస్తూ చెయ్యిపట్టి లాగాడు.

తాతయ్య ఒంగి గుర్రమైతే వాడు వీపెక్కి సవారీ చేస్తాడు. అంతలోనే 'అయ్యో తాతయ్యకి చెమటలు పట్టేశాయ్!' అంటూ ఆటసామాన్లు తెచ్చి వంటచేసి వడ్డించి బిస్కెట్లు, పిప్పరమెంట్లతో ఆకలి తీర్చేస్తాడు. తర్వాత తాతయ్యతో కలిసి 'అల్లాహో అక్బర్!' అని నమాజ్ చేస్తాడు.

అమ్మగాని నాన్నగాని వచ్చి తీసికెళ్ళేవరకు ఇంటి ధ్యాసే ఉండదు వాడికి. హోంవర్కు చెయ్యకపోతే నాన్న స్కూలునుంచి రాగానే తాతయ్య దగ్గరకెళ్లనివ్వడని ఆ లేతమనస్సు భయంతో రెపరెపలాడుతుంది. అందుకని ఎంతరాత్రయినా నిద్ర ఆపుకుని దాన్ని పూర్తి చేస్తాడు.

"అంకుల్! బాబుని తీసికెళ్ళనా!" అంటూ వచ్చాడు రఘుపతి.

చిట్టిగాడి చెయ్యిపట్టుకుని "వస్తా అంకుల్! ఆఫీసు పనిమీద బైటకెడుతున్నా. బహుశా రాత్రికి రాలేనేమో! లత కాస్సేపట్లో మీకు టిఫిన్ తెస్తుంది." అన్నాడు వెడుతూ రఘుపతి.

"అమ్మాయికి శ్రమ ఎందుకులే! నేనే వస్తా! ఇక్కడ నాకు మాత్రం ఏం తోస్తుంది చిట్టిగాడు లేకపోతే?" రషీద్ కళ్ళు ప్రేమగా బాబు వైపు చూశాయి. తండ్రి చేయి పట్టుకుని నిలబడ్డ చిట్టిగాణ్ణి తటాలున ఎత్తుకుని బయల్దేరాడు రషీద్ కూడా.

"ఏరా, వెధవా! తాతయ్య చంకెక్కావా మళ్ళీ? పెద్దవాడవౌతున్నావ్. తప్పని చెప్పానా? దిగు." లత గద్దిస్తే చప్పున దిగాడు రషీద్ కేసి బిత్తర చూపుల్తో చిట్టిగాడు.

"రా, అంకుల్! ఇలా కూర్చో. వీడు మరీ నిన్ను ఆట పట్టించేస్తున్నాడు. నువ్వు అంతకంతా వాణ్ణి గారాబం చేసేస్తున్నావ్."

"ఊరుకో బేటీ! అల్లా చల్లగా చూస్తే వాడు పెద్దవాడై పోతాడు. మనం ముద్దు చేసేదెన్నాళ్లు?"

"నువ్వు మరీ అంకుల్! స్కూలు నుంచొస్తూనే నీ దగ్గరకి పరుగు. నా మాట వినడం లేదసలు. అస్తమానం అన్నింటికీ తాతయ్యే కావాలి వాడికి. రోజూ సాయంత్రం నువ్వు పంచదార వేసి తాగిస్తే గాని వాడు పాలు తాగటం లేదు. ఈ పేచీకేం చెయ్యాలో నువ్వే చెప్పు!" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది. లత.

అమ్మ తనమీద నేరం చెబుతోందని గ్రహించిన చిట్టి బుద్ధిమంతుడిలా పుస్తకాలు ముందేసుక్కూర్చున్నాడు. వాడిచేత హోంవర్కు చేయిస్తున్నాడు రషీద్.

ఓసారెప్పుడో ఇంట్లో పంచదార నిండుకుంది. తను రఘుపతితో చెబితే:

"ఫస్టు రేపేగా! రేపు ఆఫీసునుంచొచ్చేటప్పుడు తెస్తాలే!" అన్నాడు రఘుపతి. స్కూలు నుంచొచ్చి పంచదార లేకపోతే పాలు తాగనని మొండికేశాడు చిట్టి. సముదాయించలేక సతమతమౌతోంది తను. అప్పుడే వచ్చిన రషీద్ పాలగ్లాసుతో ఉన్న చిట్టిగాణ్ణి ఎత్తుకుని వాళ్ళింటికి తీసుకెళ్ళి పంచదార వేసి తాగించాడు. అంతే! ఏడాది దాటిపోయినా చిట్టి ఈ అలవాటు మానలేదు. నవ్వుకుంది లత. రషీద్‌తో తన అనుబంధం గుర్తుకొచ్చింది.

తనూ, రఘుపతీ కాలేజీ రోజుల్లోనే ప్రేమించుకున్నారు. తమ పెళ్ళికి రెండు పక్కలవాళ్ళూ ఒప్పుకోలేదు. చివరికి ధైర్యం చేసి రిజిస్టర్ మారేజి చేసేసుకున్నారు. కానీ ఏంలాభం? ఏ ఒడిదొడుకులొచ్చినా ఆదరించేవారు లేకపోయారు. ఇద్దరికీ ఆ సహృదయుని ఇంట ఆశ్రయం లభించింది. కొద్ది రోజులకి రఘుపతికి ఉద్యోగం దొరికింది.

చిన్న అత్తరు బిజినెస్ నడుపుకుంటున్నాడు రషీద్. ఉన్న ఒక్క కూతురూ దూరదేశంలో ఉండటంతో ఒంటరిగానే ఉంటున్నాడు. లత, రఘుపతి అంటే ఎంతో అభిమానం. లతలో తన బేటీని చూసుకుంటూ మురిసిపోతాడు. చిట్టిగాడు పుట్టడంతో ఆటోమాటిక్‌గా తాతయ్య అయిపోయాడు వాడికి. పెద్దవాళ్ళకి దూరమయ్యామన్న బాధ మరిచిపోయి రషీద్‌లోనే అందర్నీ చూసుకునేవాళ్ళు లత, రఘుపతి.

"నువ్వే చెప్పు తాతయ్యా. అమ్మ నన్ను కోప్పడుతుంది."

"కోప్పడదులే నాన్నా! నువ్వే అడుగు."

"ఏవిటీ. . తాతామనవళ్ళు బేరాలు చేసుకుంటున్నారు? ఏంటిరా మళ్ళీ తాతయ్యని పట్టుకున్నావ్?"

"ఏం లేదు బేటీ! వీడికి ఆకలేస్తోందట! తొందరగా అన్నం పెట్టమని నన్ను రికమెండ్ చెయ్యమంటున్నాడు."

"అదే వీడితో వచ్చిన చిక్కు. పక్కన తాతయ్య ఉంటే ఎంత అల్లరైనా సునాయాసంగా చేసేస్తాడు. తన మాట వినడు."

"అయితే నన్ను చిట్టిగాడితో జట్టు మానేమంటావా బేటీ!"

రషీద్ తమాషాకే అన్నా గులాబీలాంటి లత హృదయానికి ముల్లులా గుచ్చుకుందా మాట. ఆమె నిలువునా కంపించింది.

"ఎంతమాటన్నావంకుల్! వీడు నీ చేతుల్లోనే పెరగాలి. నీ మంచితనం, నీ చల్లని మనసు వీడికి రావాలి."

"ఊరికే గమ్మత్తుకన్నాను బేటీ! వీడ్ని చూడకుండా ఒక్కరోజైనా ఉండగల్నా నేను

మాత్రం?" చిట్టిగాణ్ణి హృదయానికి హత్తుకున్నాడు రషీద్.

* * *

"బేటీ! బేటీ! ఏంచేస్తున్నావమ్మా!" ఖంగారుగా కేకేస్తున్నాడు గుమ్మంలోంచి రషీద్ ఓరోజు పొద్దున్న.

చిట్టిగాడికి టిఫిన్ పెడుతున్న లత "రా, అంకుల్ వంటింట్లోకి! నేనొచ్చి మాటల్లో పడ్డానంటే ఈ పెంకిఘటం తెమిల్నట్టే, స్కూలుకి."

రషీద్ డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చుంటూ "రఘు ఇంకా లేవలేదా? ఈ గుడ్‌న్యూస్ మీ ఇద్దరికీ ఒకేసారి చెప్పాలే!" అన్నాడు.

"ఏమిటంత మంచివార్త! మా బెహన్ గాని వస్తోందేంటి ఇండియాకి?"

"అల్లా నీకు భలే తెలివితేటలిచ్చాడు బేటీ! వెంటనే కనిపెట్టేశావ్!"

"అదెంతలే అంకుల్! మీ ముఖంలో సంతోషం చూస్తే తెలిసిపోయింది." చిట్టిగాడికి స్కూలు డ్రెస్ వేస్తూ అంది లత.

"ఉండు అంకుల్! ఆయన్ని లేపి తీసుకొస్తాను."

రషీద్ వచ్చాడనగానే లేచి బట్టలు సర్దుకుంటూ వచ్చాడు రఘు. రషీద్ ఆనందం అంతా పంచుకున్నారు.

"ఇంక అంకుల్‌కి మనం గుర్తుండం లతా! అసలు కూతురూ, అల్లుడూ, మనవలూ అంతా వస్తున్నారు కదా!"

రఘుపతి నోటికి చెయ్యి అడ్డం పెడుతూ "ఎంతమాట బాబూ! అసలు కంటె వడ్డీ ముద్దు. మీ తర్వాతే నాకెవరైనా!" అంటున్న రషీద్ మాటల్లో వాత్సల్యం, అభిమానం తొణికిసలాడాయి.

"అరే! రషీద్‌గారు తెలుగు సామెతలు చెప్పేస్తున్నారే!" అంటూ గలగలా నవ్వేడు రఘుపతి.

"మీ తెలివి తెల్లారినట్టే ఉంది. మన అంకుల్‌కి తెలుగు, సంస్కృతాలు క్షుణ్ణంగా వచ్చును తెలియదా మీకు! అచ్చమైన, అసలు సిసలు భారతీయులు మన అంకుల్. మనమే అంకుల్ దగ్గర పాఠాలు నేర్చుకోవాలి." అంది లత.

"ములగచెట్టెక్కిస్తే ముళ్ళగొంగళీల బాధ పడలేనే తల్లీ! ఊరికే పొగడకు. కాస్త టీ పొయ్యి మాకు. పుణ్యముంటుంది." అన్న రషీద్ మాటలకి వంటింట్లోకి వెళ్ళింది లత.

"ఇంతకీ ఇవ్వాళ మీ చేతి వంట రుచి చూసి తీరాలంటారు."

"తప్పదు రఘూ! నా ఖుషీకోసం మీరంతా మాయింట్లో భోంచెయ్యాలిసాయంత్రం!"

బలవంతాన ఒప్పించి మరీ కదిలాడు రషీద్.

"చూశావా లతా! ఆయనెంత సంతోషంగా ఉన్నాడో! అప్పుడే కూతురు కోసం మేడమీద గదులు వేయించేస్తానంటున్నాడు. చీకూ చింతాలేని అదృష్టవంతుడు!"

"అవునండీ! ఆయన అంతటి వారు కాబట్టే మనల్ని కష్టసమయంలో ఆదుకున్నారు. ఆయన వ్యాపారం చేసే రోజుల్లో నిద్రాహారాలు మర్చిపోయి, ఎంతో శ్రమ పడేవారట. లక్షలార్జించుకున్నారు. అందుకే ఇప్పుడీ సుఖం, శాంతి. ఆయన చేసిన అత్తరు వ్యాపారంలా జీవితమంతా ప్రేమాభిమానాలు గుబాళించే వ్యక్తిత్వం!" అంది లత రషీద్ గురించి తనకి తెలుసున్నదంతా చెప్పేస్తూ.

★ ★ ★

కూతురు వస్తోందన్న ఆనందంలో తలమునకలౌతూ ఆ రాత్రి విందుభోజనం తిసిపించాడు రషీద్ తనకు దగ్గరైన స్నేహితులందరికీ, వాళ్ళక్కూడా తెలుసు రషీద్‌కి లత, రఘుపతి అంటే ఎంత అభిమానమో.

"పదేళ్ళుగా ఎంత చెప్పినా మా అల్లుడు వినిపించుకోవడం లేదు. ఇప్పటికి ఎల్లాగో ఒప్పించింది మా రజియా ఇక్కడే ఉండి వ్యాపారం చేసుకోవడానికి. బంగారంలాంటి భారతదేశం వదిలిపోవడం ఎందుకూ?" రషీద్ చెబుతున్నాడు వచ్చిన వాళ్ళందరికీ.

"పోనీలెండి. పెద్దతనంలో మీవాళ్ళు దగ్గరుండటం మీకూ మంచిది." అన్నారు అందరూ. చిట్టిగాణ్ణి మాత్రం వదల్లేదు రషీద్ మొత్తం భోజనాలంత సేపూ.

ఆ రోజునుంచీ క్షణం తీరుబడి లేకుండా ఉంది రషీద్‌కి. ఎప్పుడో ఓసారి లతని పలకరించడం, చిట్టిగాడితో కాస్సేపు ఆడుకోవడం తప్పించి మిగతా టైమంతా ఇల్లుపని పూర్తి చేయడంతోటే సరిపోతోంది.

ఓరోజు రషీద్ దీక్షగా ఏవో లెక్కలు చూసుకుంటున్నాడు. లతవచ్చి మౌనంగా నిలబడింది. కాస్సేపటికి తలెత్తి చూసి, "అరే! బేటీ! ఎంత సేపైంది నువ్వొచ్చి? ఇంటిఖర్చులు అనుకున్నదానికంటె పెరిగేటట్లున్నాయి. ఇందులో పడి నిన్ను గమనించనే లేదు. అరే! అలా ఉన్నావేంటి బేటీ?" ఖంగారుగా అడిగాడు.

"నీతో ఓమాట చెప్పాలంకుల్!" దిగులుగా అంది లత.

"ఒక్కటేంటి బేటీ! నువ్వేం చెప్పినా వింటాను. నాదగ్గర దాచడం దేనికీ?" లాలనగా ఆమె తల నిమురుతూ తన ప్రక్కనే మంచం మీద కూచోబెట్టుకున్నాడు.

లత కళ్ళు చెమర్చాయి. "నాన్నా!" అంటూ భోరుమంది.

రషీద్ కాస్త ఖంగారు పడ్డాడు. తనింటికొచ్చాక ఆ పిల్ల ఎప్పుడూ అలా కలత పడటం

చూశాడు.

"ఏంటి తల్లీ! ఏమైంది? చెప్పు బేటీ! భయం లేదు నేనున్నాగా!" అన్నాడు ఆర్ద్రత నిండిన మనస్సుతో ఆప్యాయంగా.

తన గుండెలోని బాధంతా తండ్రిలాంటి రషీద్‌తో చెప్పుకుని మనసు తేలిక చేసుకుంది లత. "వస్తా అంకుల్! చిట్టిగాడొక్కడే ఉన్నాడు ఇంట్లో!" అంటూ వెళ్ళిపోయింది లత.

రషీద్ ఆలోచనలో పడ్డాడు. 'ఈ విషయం సూచనగా అనిపించినా తనకెందుకులే అని ఊరుకున్నాడు. అదే తప్పయిందేమో? ఆమధ్య రఘుపతి తరచు క్యాంపులంటూ తిరగడం, అర్ధరాత్రి దాటాక ఇల్లు చేరడం, బారెడు పొద్దెక్కినా నిద్రలేవక పోవడం గమనించకపోలేదు. తను ఈ పాటికే పట్టించుకుని రఘుపతిని మందలించి ఉండవలసింది. ఛ.. ఛ. . తనేంటి ఇలా చేశాడు? తనని నమ్ముకున్న లతకి ఇంత అన్యాయం జరిగిపోతోంటే చూస్తూ ఊరు కున్నాడా? తన పెద్దరికం మీద ఆ బేటీకి ఎంత విశ్వాసం! ఇక ఊరుకోకూడదు. ఇప్పటికే పరిస్థితి చెయ్యిదాటిపోయినట్లుంది. లత అల్లుకున్న పందిరి చల్లగా ఉండాలి. అనురాగంతో లత బ్రతుకంతా విరబూయాలి. రఘుబాబుతో వెంటనే మాట్లాడి నచ్చజెప్పాలి.' ఆ రాత్రి రషీద్‌కి నిద్ర కరువైంది. ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

★ ★ ★

రఘుపతి పిడికిళ్ళు బిగించాడు ఆవేశంతో. కళ్ళు చింతనిప్పులయ్యాయి. "ఇంతకీ నువ్వెవరివి? నా విషయంలో కల్పించుకుంటున్నావ్?" ఆవేశంతో రషీద్ పై ఉరిమాడు.

"ఉద్రేకపడకు బాబూ! నిదానించు. నేనుచెప్పేది మీ మేలు కోరే!".

"ఏవిటయ్యా, నువ్వు కోరే మేలు? సరాసరి క్లబ్బుకే వచ్చి నా పరువు తీస్తావా! ఏదో నలుగురితో సరదాగా తాగానే అనుకో! దానికింత రాద్ధాంతమా! నా ఫ్రెండ్స్ ముందు తలెత్తుకోలేకుండా చేసావ్! ఏం పెద్దమనిషివయ్యా! నా మీద అధికారం చెలాయించడానికి నువ్వెవరవసలు? నా సంగతి నీకు తెలీదు. పులుసులోకి ఎముక లేకుండా ఏరిపారేయగలను. జాగ్రత్త!. . ." నోటికొచ్చినట్టు తిట్టుకుంటూ ఇంటిదారి పట్టాడు రఘుపతి క్లబ్బునుంచి.

చిట్టిగాణ్ణి పడుకోబెట్టి రఘుపతికోసం ఎదురుచూస్తోంది లత. గృహిణిగా ఇన్నేళ్ళూ ఆనందాన్నే చవిచూసింది. ఆఫీసు నుంచి ఆత్రంగా ఇంటికొచ్చి "ఇంకా వంటింట్లో పన్లేంటోయ్! అలా కులాసాగా తిరిగొద్దాం రా! అంటూ పని చెయ్యనిచ్చేవాడు కాదు. తీపి ముచ్చటలేవో కలబోసుకుంటూ ప్రణయమాధుర్యంలోనే చంద్రునికి వీడ్కోలిచ్చి సూర్యుడికి స్వాగతం చెప్పే వారిద్దరూ. తననీ, బాబునీ ఒక్క రోజైనా విడిచి ఉండలేని రఘుపతిలో ఏవిటీ మార్పు? ఆమెకి తెలియకుండానే దుఃఖం ముంచుకొచ్చింది. మౌనంగా రోదిస్తోంది.

బిగ్గరగా అరుస్తూ గట్టిగా తలుపుతట్టాడు రఘుపతి. కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ

గభాల్న లేచి వెళ్ళి తలుపు తీసింది లత.

"కాస్త నెమ్మదిగా పిలవరాదూ! ఇరుగూ పొరుగూ ఏవన్నా అనుకుంటారు!" అంటూ లత భర్త ముఖంలోకి చూసి చూపులు వాల్చేసుకుంది.

"వాళ్ళనుకోవడం దేనికీ? తమరే దండోరా వేస్తున్నారుగా!" కోపంగా అన్నా రఘుపతి మాటలు ముద్దగా వస్తున్నాయి. తన భవిష్యత్తును, చిట్టిగాడి బంగారు భావినీ కాలరాసే ఘాటైన వాసన. తూలుతూ లోపలికొస్తున్న రఘుపతికి చెయ్యాసరా ఇచ్చి మంచం మీదకి చేర్చింది.

"పనికట్టుకుని నేనెవ్వరికీ చెప్పలేదండీ! రషీదంకుల్ మనకి పెద్దదిక్కని మీరే అనేవారుగా ఎన్నోసార్లు. అయినా మీరిలా దిగజారిపోతే మన బ్రతుకులేం కావాలి చెప్పండి! చిట్టిగాడి కోసమేనా మీరీ పాడు తాగుడు జోలికి పోవద్దండీ!" చేతులు పట్టుకుని బ్రతిమాలింది.

లత చేతులు విసిరి కొడుతూ "నీకసలు గుట్టూ మట్టూ లేదే! దరిద్రాన్ని కోరి తెచ్చుకున్నాను. వాడితో ఏంచెప్పావో? ... నడిరోడ్డు మీద నిలేసి నీతిసూత్రాలు వల్లించాడు. వాడి పంచన ఉంటున్నామనేగా నామీదా జులుం చెలాయిస్తున్నాడు!" నిద్ర ముంచుకొచ్చేవరకూ సణుగుతూనే ఉన్నాడు రఘుపతి. అతని మనస్సులో రషీద్ మీద ఎంత కసి పేరుకుందో అర్థమైంది లతకి.

★ ★ ★

చిట్టిగాడు స్కూలునుంచి వస్తూనే "అమ్మా! ఎందుకని తాతయ్యతో మాట్లాడగూడదే! మనం తాతయ్యకి దూరంగా ఇంకో ఇంటికెళ్ళిపోతామా! డాడీ అంటున్నారు. అలా వెళ్ళొద్దమ్మా!' అంటూ ఏడవడం మొదలెట్టాడు.

'ఓహో! వీణ్ణి స్కూల్లో దిగబెడుతూ ఈయన చేసిన నిర్వాకం ఇదా!' అనుకుంటూ చిట్టిని సముదాయించే ప్రయత్నంలో పడింది.

"ఏడవకు నాన్నా! ముందు బిస్కెట్లు తిని యీ పాలు తాగు. పంచదార కలిపాన్లే! ఒళ్ళోకి తీసుకోబోయింది.

"నాకేం అక్కర్లేదు. తాతయ్య చాలా మంచివాడు. కథలు చెబుతాడు. నేను తాతయ్య జట్టే! మనం తాతయ్యని ఒదిలి పెట్టి ఇంకో ఇంటికెళ్ళిపోతామంటే నేనస్సలెప్పుడూ పాలు తాగను!" అలిగి అమ్మకి దూరంగా నిలబడ్డాడు.

"నాచిట్టి బంగారు తండ్రి కదూ! నేను కళ్ళు మూసుకుంటాను. నేకళ్ళు తెరిచే లోగా ఎంచక్కా పాలు తాగేస్తాడు, బిస్కెట్లు తినేస్తాడు!" గోముగా బుజ్జగించింది. కళ్ళు తెరిచిన లత పాలగ్లాసుతో సహా చిట్టిగాడు మాయమైతే గతుక్కుమంది.

"చెప్పు తాతయ్యా!నన్నూ, అమ్మనీ, నాన్ననీ నువ్వు వెళ్ళిపొమ్మంటున్నావా?" ఒళ్ళో

కూర్చుని పసివాడలా అనేసరికి అదిరిపడ్డాడు రషీద్.

"లేదుబాబూ! నేనెప్పుడూ అలా అన్లేదే! మీరెప్పుడూ నాదగ్గరే ఉంటారు." మరింత ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు.

"ఏమిటంకుల్! వీడప్పుడే మీ ఒళ్ళో చేరాడా!" భర్త వస్తే ఏంగొడవ చేస్తాడో అన్న తన భయాన్ని తెలియనివ్వకుండా చిట్టిని చెయ్యి పట్టి లేపింది.

ఎందుకులే తల్లీ! నాదగ్గర దాస్తావ్! మీ ఆయనకి నామీద బాగాకోపంగా ఉంది. కారాలూ, మిరియాలూ నూరుతున్నాడుగా!" అన్నాడు రషీద్.

"నేనే పొరబాటు చేశాను. నాఖర్మ నాదని ఊరుకొని ఉంటే ఇంతవరకూ వచ్చేది కాదు. ఆయన మిమ్మల్ని ఇంకా ఏమంటారో అనే నా బాధంతా!"

"అంటే అననీయమ్మా! ఇలాంటివి మనసులో ఉంచుకుని ఒక్కదానివే ఎంతకని ఆవేదన పడతావు? నీ సంసారం కుదుట పడితే నేనెన్ని మాటలు పడ్డా ఫరవాలేదు. నాగురించి నువ్వేమీ బాధపడకు. . . మరొక్క మాట తల్లీ! అతగాడికిష్టం లేకపోతే మనం కొంచెం దూరమైతేనే మంచిది. . . నా భోజనం కోసం, ఫలహారం కోసం ఇక నువ్వు శ్రమ తీసుకోకు. రఘుపతి సరైన దార్లో పడే మంచిరోజులొస్తాయిలే! నిత్యం వాదం పెట్టుకుని చిలికి చిలికి గాలివాన చేసుకోకమ్మా! వెళ్ళి రా బేటీ!" రషీద్ కళ్ళు చెమర్చాయి. లత మౌనంగా చిట్టిగాణ్ణి తీసుకుని వెళ్ళిపోయింది.

వసంతంలో వచ్చిన తుపానులాగా లత జీవితంలోని ఆనందాన్ని బీభత్సం చేయసాగాయి పరిస్థితులు. భర్త ఏంచేసినా తను పట్టించుకోకపోతే కొంత ప్రశాంతంగా రోజులు నెట్టుకు రాగలిగేదేమో! కానీ తనలా ఉండలేకపోయింది. తొలిదశలోనే తన ప్రాణానికి ప్రాణమైన రఘు ఆ దురభ్యాసానికి లోబడకుండా ఉండేందుకు తన వంతు ప్రయత్నం చేసింది కానీ, తను దురదృష్టవంతురాలు. భర్త తన తప్పిదాన్ని తెలుసుకోకపోగా, దేవుళ్ళాంటి రషీదంకుల్ మీద కక్ష పెంచుకుంటున్నాడు. లత ఎప్పుడూ ఇలాంటి ఆలోచనల్తోనే ఉదాసీనంగా ఉండసాగింది. చిలిపి అల్లరితో ఇల్లంతా సందడి చేసే చిట్టిగాడు చిన్నబోయి కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు ఇంట్లోనే.

* * *

అడుగులో అడుగేసుకుంటూ నెమ్మదిగా స్కూలునుంచొస్తున్న చిట్టి ఇంటిముందు ఇసక గుమ్మరిస్తున్న లారీని చూడగానే ఉత్సాహంతో పరుగెత్తాడటుకేసి.

"భలే! భలే! ఎంత ఇసకో! బీచ్ అంతా మనింటికొచ్చేసినంత తమాషాగా ఉంది." రాసిగా పోసిన ఇసకపై ఎగురుకుంటూ ఆడుతున్నాడు. చాలాకాలం తర్వాత ఆ పసిమనసు చిందులేస్తోంది. గంటలు గడిచిపోతున్నాయి. వాడి ఆట ధ్యాస పెరుగుతోంది. దోసిళ్ళతో ఇసక తీసి విసిరేస్తున్నాడు. కుప్ప వెనకాల దాక్కుని 'ఇప్పుడు అమ్మొచ్చినా నన్ను పట్టుకోలేదు!'

అనుకుని తన్లో తనే నవ్వుకుంటున్నాడు గంతులేస్తూ. చీకటి పడుతున్నా గమనించడం లేదు ఆ ఎవరెస్టు శిఖరం ఎక్కిన హుషార్లో.

"ఏయ్! చిట్టీ! ఎంతసేపా అల్లరి? చీకటి పడుతోంది ఇంటికెళ్ళు! పోన్లే అని ఊరుకుంటూంటే ఇసకంతా ఖరాబ్ చేస్తున్నావ్!" రషీద్ మందలింపు వాడికి వినపడితేగా!

"ఇదిగో! నిన్నే(రా! బంగారం లాంటి ఇసకలో ఏంటా గెంతులు? ఇంటికెళ్తావా . . లేదా?" రషీద్ గట్టిగా కేక వేశాడు.

"నేనిక్కడే ఆడుకుంటా! ఏంచేస్తావ్ తాతయ్యా!" పెంకిగా ప్రశ్నించాడు.

రషీద్ తెచ్చిపెట్టుకున్న కోపంతో "ఏంచెయ్యడమేంటి భడవా! అరికాళ్ళల్లో వాతలు పెట్టేస్తా!'

అప్పుడే ఇంటికొచ్చిన రఘుపతి కిటికీలోంచి చూస్తూ వాళ్ళ సంభాషణ విన్నాడు. అతనిలో బుసలు కొడుతున్న క్రౌర్యం విచిత్రమైన ఊహను ప్రేరేపించింది. ఈ దెబ్బతో రషీద్‌కి గుణపాఠం చెప్పగలడు. ముప్పుతిప్పలు పెట్టి మూడు చెఱువుల నీళ్ళు తాగించగలడు. తను అనుకున్నది సాధించ గలడు. . . అనే పట్టుదల బిడ్డమీద మమకారాన్ని పక్కకి నెట్టేసింది.

లత దొడ్లో మొక్కలకి నీళ్ళు పోస్తూండటంతో మరింత తేలికైంది రఘుపతికి. స్టౌ అంటించి అట్లకాడ కాల్చి వెనక పాటుగా వచ్చి ఒక ఉదుటున చిట్టిని తోసి లేత అరికాళ్ళని బొబ్బలెక్కించాడు. అంతే! చిట్టి కెవ్వుమన్నాడు. ఒక్కక్షణం బాధతో, భయంతో విలవిలలాడి స్పృహ కోల్పోయాడు. మనిషి రాక్షసుడైన క్షణం అది.

చిట్టిగాడి కేక వినగానే దొడ్లో ఉన్న లత కంగారుగా పరిగెత్తిందటుకేసి. భోజనం తయారుచేసుకుంటున్న రషీద్ అదిరిపడ్డాడు. ఇద్దరూ కంగారుతో చిట్టిగాడున్న దగ్గరకొచ్చారు. అప్పటికే చిట్టిని భుజాన్నేసుకుని రొప్పుతూ గబగబా నడుస్తున్నాడు రఘుపతి.

"ఏమైంది బేటీ?" "ఏం జరిగిందంకుల్?" ఒకేసారి ఒకర్నొకరు ప్రశ్నించుకున్నారు.

"దొడ్లో ఏదో పన్లో ఉండి చిట్టిగాడు స్కూలునుంచి రావడమే గమనించలేదు.." అంటూ భోరుమంది.

"నాకూ అర్థం కావడం లేదు. ఇప్పటిదాకా ఇక్కడే ఆడుకుంటున్నాడు. నేను కేకలేశా ఇంటికెళ్ళమని, ఇంతలోనే చిట్టి కెవ్వుమనడం, రఘుపతి వాణ్ణి ఎత్తుకుని ఖంగారుగా వెళ్ళడం.. ఏవిటో అంతా అయోమయంగా ఉంది.." అంతుపట్టని ఆలోచనలో ఉండిపోయారిద్దరూ.

తను చెప్పాలనుకున్నదంతా సబిన్స్పెక్టర్ ఏడుకొండలికి చెప్పాడు రఘుపతి.

"ఎంతదారుణం చేశాడో చూడండి సార్! ఏదైనా కోపం ఉంటే మామీద తీర్చుకోవాలి గాని ఈ పసివాడి మీదనా? ఇదేంన్యాయం?"

"న్యాయం జరిగేట్లు చూడ్డానికే కదండి మేమూ, కోర్టులూ ఉన్నది. మీరు రిపోర్టిచ్చి

వెళ్ళండి. కేసు రాసి అతని సంగతి మేం చూస్తాం. త్వరగా అబ్బాయిని హాస్పటల్‌కి తీసికెళ్ళండి.' అన్నాడు ఎస్సై.

"ఒక్కగా నొక్క బాబు మాకు. ఏమౌతుందో ఏమో..?" దీనంగా చూస్తూ అటుగా వస్తూన్న ఆటోని పిలిచి ఎక్కి కూర్చున్నాడు హాస్పటల్‌కి పోనిమ్మంటూ.

అంతవరకూ ఎన్నో దారుణాలు చూసినా ఇది మాత్రం బాగా కదిల్చేసింది ఎస్సయినీ కానిస్టేబుల్స్‌నీ.

"ఈ ముసలి పీనుగుని మాత్రం ఊరికే వదిలి పెట్టకూడదు సార్." హెడ్ కానిస్టేబుల్ కళ్ళెర్రజేశాడు.

"పీనుగా! పిశాచమా! ఆ చంటాడి లేత పాదాలెలా కాలిపోయాయో! చూస్తూంటే కడుపు తరుక్కుపోతోంది. వాణ్ణి కోర్టుకి తీసికెళ్ళాల్సిందే!" కానిస్టేబుల్ కైలాసం గట్టిగా సపోర్టు చేశాడు.

రాత్రి పది దాటుతూంటే వచ్చాడు రఘుపతి చిట్టినెత్తుకుని.

"ఏమైందండీ బాబుకి? నా చిట్టికేమైందీ?" ఆత్రంగా అందుకోబోయింది లత.

"చేసిన ఘనకార్యం ఏవిటో నీ అంకుల్ చెప్పలేదా?" చిట్టిని మంచం మీద పడుకోబెడుతూ అన్నాడు కోపంగా రఘుపతి.

"అంకులా! అతనేంచేశారండీ మధ్య?" చిట్టి పసిపాదాలకున్న కట్లు చూసి బిత్తరపోయింది.

"ఏంచెయ్యలేదు పాపం! అతని బంగారంలాంటి ఇసక ఎక్కడ పాడవుతుందోనని తిట్టిపోశాడు ముందు. మనవాడు అప్పటికీ ఆ దరిద్రపు ఇసకతో ఆడ్డం మానలేదు. ఓ రెండు వాతలేశాడు." లత మరింత ఆశ్చర్యపోయింది.

"ఛ..ఛ..!అతనలాంటి మనిషి కాదు." అప్రయత్నంగానే అనేసింది.

"అలాగే! అయితే ఇలా ఎవరు చేసినట్లు?" రఘుపతి కోపంగా ప్రశ్నించాడు.

"ఏమో! అదే తెలీకుండా ఉంది. మీకూ తెలియదా?" చిట్టిగాణ్ణి ఒళ్ళోవేసుకుని కుమిలి కుమిలి ఏడ్వసాగింది.

'మానవత్వం మూర్తీభవించిన అంకుల్ యిలాంటి పని ఎందుకు చేస్తాడు? రఘుపతి అంత వెంటనే ఎలా అక్కడికెళ్ళ గలిగాడు? తనక్కూడా చెప్పకుండా చిట్టిని తీసుకుని సరాసరి పోలీసు స్టేషను కెందుకెళ్ళాడు? రఘుపతే చేసుండాలీ పని అంకుల్ మీద కోపంతో...' ఆలోచనలతో లతకి తల తిరిగిపోతోంది.

"నేనేడ్చేది చిట్టిగాడి బాధని గురించి కాదండీ! మీ ఆత్మసాక్షిగా చెప్పండి. ఇదెవరివల్ల జరిగిందో?"

"లతా! మాటలు జాగ్రత్తగా రానీ! చిట్టిగాడు నీకెంతో నాకూ అంతే! వాడు నాకు

మాత్రం కొడుకు కాదా?"

"మరైతే ఇంత పనెలా జరిగింది మీకు తెలియకుండా!"

లత చెంప ఛెళ్ళుమంది.

"మీరు కొట్టినా, చంపినా నా ఊహ మాత్రం నిజం. కాదని నిరూపించుకోండి!" లత దిగ్గున లేచి నిలబడింది.

"ఇన్నాళ్ళు మీలో మూర్ఖత్వమే ఉందనుకున్నాను. దాన్ని మించిన పశుత్వం కూడా ఉందని ఇప్పటికి తెలిసింది." లత ఉగ్రస్వరూపం రఘుపతిని రవ్వంత భయపెట్టింది.

"నువ్వు ఒకే వైపునించి ఆలోచిస్తున్నావ్! నిన్న మొన్నటిదాకా మనకీ రషీద్ ఎవడు? అతగాడి మంచి చెడులు మనకేం తెలుసు? పైకి కనిపించే మంచితనం ముసుగులో ఏం దాగి ఉందో నువ్వేమైనా తెలుసుకోగలిగావా? నువ్వు పట్టిన కుందేటికి మూడేకాళ్ళన్నట్టు మాట్లాడుతున్నావు." లతని తన ధోరణిలోకి మళ్ళించుకోవాలని నెమ్మదిగా నచ్చచెప్పబోయాడు.

"ఎంత తేలిగ్గా అనేశారండీ! రషీద్ మనకెవరని. నడిరోడ్డున పడ్డ మన జీవితాల్ని ఒక గమ్యం చేర్చారు. మనకోసం ఎంతో చేశారు. తండ్రిలాంటి అంకుల్‌ని పట్టుకుని అంత మాటలనడానికి నోరెలా వచ్చిందండీ మీకు?" లత గట్టిగా ఎదురు ప్రశ్న వేసేసరికి అంతులేని కోపంతో రెచ్చిపోయాడు రఘుపతి.

"పైకి తండ్రిలాంటివాడంటున్నావ్. కానీ మీ ఇద్దరి మధ్యా వేరే ఏ సంబంధం లేకపోతే నువ్వతన్ని ఇంత ఇదిగా ఎందుకు వెనకేసుకొస్తున్నావ్? మీ నిజస్వరూపం ఇదన్న మాట!"

వేటగాడి పదునైన బాణం నాటిన లేడికూనలా విలవిలలాడింది... లత హృదయం ఆ మాటకి.

'ఇంతకు తెగించిన వాళ్ళతో మాట్లాడి తను సాధించేదేమిటి? ఇంత జరిగాక తనకిక బ్రతుకులో మిగిలిందేవుంది?'

"అమ్మా... అమ్మా..." చిట్టి బాధతో కూడిన కలవరింత లత ఆలోచనల్ని ఆపేసింది. వాణ్ణి బుజ్జగిస్తూ కొంత స్థిమిత పడటానికి ప్రయత్నించింది.

* * *

పట్టరాని ఆనందంతో పుట్టిన దేశంలో అడుగు పెట్టిన రజియా ఈ కల్లోలానికి మనసు వికలమై బాధపడసాగింది.

"ఎంతో పరువు ప్రతిష్ఠలతో ఆత్మగౌరవమే పెన్నిధిగా బ్రతికిన డాడీ ఇలా బజారున పడటమా! కోర్టుకెక్కినవాడూ, గాడిదెక్కినవాడూ ఒక్కటే అనిపించుకుంటూ అపహాస్యం పాలు

కావడమా? అసలు డాడీ వీళ్ళని దగ్గర తీయకుండా ఉండాల్సింది." ఆ మాటే అనేసింది తండ్రితో.

"చూడు బేటీ! కష్టాల్లో ఉన్న వాళ్ళని దగ్గరకి తీసి ఓ దారి చూపించడమే అల్లా అయినా ఈశ్వరుడైనా మెచ్చే పని. అదే నేనూ చేశాను. ఆ బేటీలో నువ్వు కనిపించేదానివి. నీకూ అవసరాలొచ్చినప్పుడెవరో సాయం చేయొద్దా! ఆపసివాడిమీద ప్రేమ ఇప్పటికిలా వచ్చింది నన్నేం చెయ్యమంటావ్?" రషీద్ మనస్సు కూడా అల్లకల్లోలంగా ఉంది.

రఘుపతి తన సంపాదనంతా ఫీజుగా పెట్టి అయినా సరే కేసు గెలిచి తీరాలనుకున్నాడు. అదే పనిలో మునిగిపోయాడు. రాత్రి ఆలస్యంగా ఇంటికొచ్చి ఒళ్ళు తెలియకుండా నిద్ర పోయాడు.

★ ★ ★

చుఱ్ఱుమని ఎండ కిటికీలోంచి మొహంమీద పడుతూంటే మెలకువొచ్చింది రఘుపతికి. తన పట్టుదల నెరవేర్చుకుని విజయం సాధించడానికి తొలిప్రయత్నం ఆరంభించేది ఈ రోజే.

'ఏవిటీ! ఇంత పొద్దెక్కి లేచానబ్బా!' అనుకుంటూ మంచం దిగాడు శరీరం కాస్త బరువుగా ఉంది. అడుగు ముందుకేయబోతూ తూలుతున్నాడు. అర్థరాత్రివరకూ లాయరు లక్ష్మణ మూర్తితో బార్‌లో గడిపిన ఫలితం.

'ఇవ్వాళ లక్ష్మణమూర్తి రషీద్‌కి కోర్టుసమన్లు పంపేటట్లు చూస్తానని ప్రామిస్ చేశాడు. ఈ దెబ్బతో ముసలిపీనుగ దిగిరావల్సిందే! లేకపోతే నాతోనే పెట్టుకుంటాడా!' ఆవేశంతో కాలకృత్యాలు ముగించాడు. డైనింగ్‌హాల్లోకొచ్చాడు. హాట్‌బాగ్‌లో టిఫిన్, ఫ్లాస్కులో కాఫీ సాక్షాత్కరించాయి.

'అరే.. నేనిప్పటివరకూ గమనించనేలేదే! లత ఏమైనట్టు? చిట్టిగాడెక్కడ? తనపై కోపంతో లత ఇల్లు విడిచి పోలేదు కదా!!' అనుకోగానే నవ్వొచ్చింది.

'ఆ.. తను తప్ప దానికెవరున్నారు? పుట్టింటివాళ్ళందర్నీ ఏనాడో కాదనుకునొచ్చేసింది..!' ధీమాగా నవ్వుకున్నాడు మళ్ళీ.

ఫ్లాస్కులోంచి కాఫీ గ్లాసులోకి ఒంపుకుంటూ ఫ్లాస్కు కింద మడిచిపెట్టిన కాగితాల్లోంచి పై కాగితం అందుకున్నాడు.

తెచ్చిపెట్టుకున్న ధైర్యం కొద్దిగా సడలి కాగితం మడతవిప్పి ఆత్రంగాచదవ సాగాడు

"శ్రీవారూ! నమస్కారం. మీదానిగా బ్రతుకు సాగించి, మీ లతగానే రాలిపోవాలనుకున్న నాకు ఆ అదృష్టాన్ని దక్కకుండా చేశారు. ఈ విధంగా జరుగుతుందని మనం ఊహించలేదు. నేను మీనుంచి శాశ్వతంగా విడిపోవడానికి నిశ్చయించుకున్నాను. దానికి కారణం ఒక్కటే! 'దేశానికి ఉత్తమపౌరుని అందివ్వడంలో తల్లిగానేను నా బాధ్యతను నిర్వర్తించలేన'నే భయం.

మీ హృదయాకాశంలో దట్టంగా ఆవరించిన విషపు మేఘాలు పగ, ద్వేషం వర్షిస్తున్నాయి. వాటిల్లో మన బిడ్డ తడిస్తే మరో విషసర్పం తయారౌతుందేమో! నాకేం అయినా సరే అలా జరగనివ్వను. అందుకే మనసు రాయి చేసుకున్నాను. ఈ ఉత్తరంతో పాటు మన విడాకుల పేపర్లు జతపరుస్తున్నాను. 'దీనికింత సాహసమా!' అనుకుంటున్నారు కదూ! ఒక్కసారి గతం నెమరు వేసుకోండి. ఒకరికొకరం ప్రేమబంధంతో పెనవేసుకున్నాం. నా అన్నవాళ్ళు దూరమైన మనకి రషీదంకుల్ ఆశ్రయమిచ్చి ఉండకపోతే, ఈనాడిలా జీవించగలిగేవాళ్ళమా? అతని చల్లని మనసే మనకొక కోవెల అనుకున్నాం. ఏ మతం వారైనా మనమంటే ఎంత అభిమానించేవారు! మిమ్మల్ని ఆవరించిన బలహీనతను రూపుమాపాలనే ఆయన తపన... అదీ...మన క్షేమం కోరే కదా! మీరే సహించలేక దాన్ని గోరంతలు కొండంతలు చేశారు. కొండంత కీడు చేసినా, గోరంతగా భావించి ప్రేమాభిమానాలు పంచే మహోన్నత వ్యక్తి అంకుల్. నేను నిందల పాలైనా ఫర్వాలేదు. చిట్టిగాడితో సహా ఆ ఆలయానికే వెళ్ళదలుచుకున్నాను. అతని కూతురుగానే జీవితం గడప దలచుకున్నాను.

వీలైనంత త్వరలో విడాకుల కాగితాలపై సంతకం చేసి పంపమని కోరుతూ....

కోటి నమస్కారాలతో ...

మీ లత"

రఘుపతి చేతిలో కాగితాలు అప్రయత్నంగా జారిపోయాయి. లత నిశ్చయం దిగ్భ్రాంతి కలిగించింది. ఇదేంటి? ఇలా జరిగిందేమిటి? వివేకం తలెత్తసాగింది.

'తనే దురాలోచనలు దొంతరగా పెంచుకుంటూ ఈ స్థితికి దిగజారాడు. లత చెప్పినట్టు తన మనస్సున కమ్మిన మబ్బుల్ని పూర్తిగా తొలిగించుకోవాలి. తన ప్రణయాధిదేవత లత తనకు కావాలి. ఆమె సాహచర్యంలేందే తను బ్రతగ్గలడా? ఆ ఊహే భరించలేనిది. అలా ఎప్పటికీ జరక్కూడదు....' తీవ్రంగా తల పట్టుకుని ఆలోచనల్లో పడ్డాడు. ఓ నిర్ణయానికొచ్చి దిగ్గున లేచి, తనూ ఆ ఆలయానికే కదిలిపోయాడు రషీద్‌కి క్షమాపణ చెప్పుకోవడానికి.

●

*("తెలుగు పలుకు"-ఆస్ట్రేలియా తెలుగు పత్రిక : సెప్టెంబరు '94 -జనవరి'95)*